క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్ఎస్‌పీడీసీఎల్–11 కేవీ ఆజామాబాద్ డివిజన్ పరిధిలోని విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏడీఈ విజయ్‌భాస్కర్ తెలిపారు. బ్రాహ్మణహాస్టల్ ఫీడర్ పరిధిలో బ్రాహ్మణ హాస్టల్, ఇందిరానగర్, తిలక్‌నగర్ ఆసుపత్రి, న్యూ నల్లకుంట తదితర ప్రాంతాల్లో 9.30 నుంచి 12 గంటల వరకు, సంజీవయ్యనగర్ ఫీడర్ పరిధిలో తిలక్‌నగర్, సంజీవయ్యనగర్, మీసేవా, శివాలయం టెంపుల్, తాడి కంపౌండ్, వెజిటెబుల్ మార్కెట్ తదితర ప్రాంతాల్లో 11.30 గంటల నుంచి 1.30 గంటల వరకు, డీడీ కాలనీ ఫీడర్ పరిధిలో రామచంద్రయ్య డిగ్రీ కాలేజ్, గ్లాస్ కో, హిల్టన్ కేఫ్ తదితర ప్రాంతాల్లో 2.30 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

అభినందన

కాచిగూడ: వైజీటీఏ తైక్వాండో కరాటే అకాడమీ హెడ్ కోచ్ డి.విశ్వనాథ్ ఆధ్వర్యంలో కరాటే మాస్టర్స్, కోచ్‌లు సోమవారం చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కరాటే విద్యలో మరింతగా రాణించి రాష్ట్రానికి మంచిపేరు తీసుకురావాలని ఇన్‌స్పెక్టర్ వారికి సూచించారు. పులిగంటి వేణుగోపాల్, సీనియర్ కోచ్ వాసు తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీతోనే సుస్థిర పాలన'



అంబర్‌పేట: బీజేపీతోనే సుస్థిర పాలన సాధ్యమవుతుందని ఆ పార్టీ గద్వాల జిల్లా ఇన్‌చార్జి బి.వెంకట్‌రెడ్డి తెలిపారు. సోమవారం బీజేపీ చేపట్టిన మహా సంపర్క్ అభియాన్‌లో భాగంగా డీడీ కాలనీలోని మాజీ అడ్వకేట్ జనరల్ రామకృష్ణారెడ్డిని కలిశారు. కేంద్ర ప్రభుత్వ తొమ్మిదేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని వెంకట్‌రెడ్డి ఆయనకు వివరించారు. పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఈనెల 4న రాష్ట్ర డెమోక్రటిక్ ఫ్రంట్ సమావేశం

కాచిగూడ: తెలంగాణ డెమోక్రటిక్ ఫ్రంట్ సమావేశం ఆగస్టు 4న బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు ఫ్రంట్ కన్వీనర్ వెంకటస్వామి ప్రకటించారు. ఈ సందర్భంగా 'ఎన్నికలు – కర్తవ్యాలు' అనే అంశంపై జరిగే సదస్సులో ఆచార్య వీరస్వామి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు సమాచారం. సోమవారం నారాయణగూడలోని తెలంగాణ కమ్యూనిస్ట్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఫ్రంట్ అభ్యర్థులను గెలిపించే లక్ష్యంతో ముందుకెళ్తున్నామన్నారు. కట్టా శ్రీనివాస్, మారగోని జయశ్రీగౌడ్, వెంకటేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

5న మినిస్టర్స్ క్వార్టర్స్ ముట్టడి

కాచిగూడ: సామాజిక, రాజకీయ, ఆర్థికంగా అన్ని రంగాల్లో వెనుకబడిన మున్నూరుకాపుల అభివృద్ధి, సంక్షేమం కోసం మున్నూరుకాపు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ.. ఈనెల 5న శనివారం ఉదయం 10:30 గంటలకు మినిస్టర్స్ క్వార్టర్స్‌ను ముట్టడిస్తామని మున్నూరుకాపు యువత రాష్ట్ర అధ్యక్షుడు సంజయ్‌పటేల్ తెలిపారు. మున్నూరుకాపు కార్పొరేషన్ డిమాండ్‌ను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు మున్నూరుకాపులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఘనంగా పూనెంలింగన్న వర్ధంతి

ముషీరాబాద్: సీపీఐ(ఎంఎల్) న్యూ డెమాక్రసీ రాష్ట్ర నాయకులు పూనెం లింగన్న 4వ వర్ధంతిని విద్యానగర్‌లోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం లింగన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వెంకటరామయ్య, జే.వీ.చలపతిరావులు మాట్లాడారు. దివంగత లింగన్న నాయకత్వంలో గుండాల ఏజెన్సీ ప్రాంతంలో వేలాది ఎకరాల పోడు భూములను పేద, ఆదివాసి, గిరిజన ప్రజలకు పంచిపెట్టారన్నారు. ఐఎఫ్‌టీయూ జాతీయ నాయకులు ప్రదీప్, రాష్ట్ర ఉపాధ్యక్షులు అరుణ, అరుణోదయ రాష్ట్ర అధ్యక్షులు నాగన్న, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు మహేష్, ప్రధానకార్యదర్శి శ్రీకాంత్, శ్యామ్, శ్రీను, రంజిత్, సత్యనారాయణ, లక్ష్మి, పుష్ప, నవ్య తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



గోల్నాకలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తదితరులు

అంబర్‌పేట: నియోజకవర్గ ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయంగా అభివృద్ధి పనులను పెద్దఎత్తున చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. సోమవారం బాగ్‌అంబర్‌పేట డివిజన్ పాముల బస్తీలో రూ.39.50 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులను కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడమే ధ్యేయంగా అభివృద్ధి పనులను చేపడుతున్నామన్నారు.

గోల్నాక డివిజన్ గంగానగర్‌లో రూ.18 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు, జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి..



జలమండలి డీజీఎంకు వినతిపత్రం అందజేత

అంబర్‌పేట: డివిజన్‌లో పలు బస్తీల్లో తలెత్తుతున్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ ఉపాధ్యక్షురాలు శంభుల ఉష శ్రీకాంత్‌గౌడ్ జలమండలి డీజీఎం విష్ణువర్ధన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. సోమవారం బాగ్ అంబర్‌పేటలోని కుమ్మరిబస్తీ, మైసమ్మ ఆలయం లైన్ ప్రాంతాల్లో కలుషిత తాగునీరు సరఫరా అవుతుందని డీజీఎంకు ఆమె వివరించారు. కలుషిత నీటితో స్థానికులు వ్యాధుల బారిన పడుతున్నారని ఆమె డీజీఎం దృష్టికి తీసుకెళ్లి తక్షణమే సమస్యను పరిష్కరించాలని కోరారు.

నల్లకుంట ఎస్‌హెచ్ఓగా జగదీశ్వర్‌రావు





బదిలీపై వెళ్తున్న సీఐకి వీడ్కోలు పలుకుతున్న దృశ్యం

నల్లకుంట: నల్లకుంట ఎస్‌హెచ్‌ఓగా బి. జగదీశ్వర్‌రావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పీఎస్ సిబ్బంది ఆయనకు గజమాలతో ఘనస్వాగతం పలికారు. 2007 బ్యాచ్‌కు చెందిన ఆయన కాచిగూడ సీఎస్, మంగళ్‌హాట్ పీఎస్, సీసీఎస్‌లో ఎస్సైగా విధులు నిర్వహించారు. అనంతరం పదోన్నతి పొంది రాచకొండ పరిధిలోని మల్కాజిగిరి, నాచారం ఎస్‌హెచ్‌ఓగా సేవలందించారు. ఆయన మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ స్టేషన్ సిబ్బంది సహకారంతో శాంతి భద్రతలను పరిరక్షిస్తానన్నారు.

వీడ్కోలు..

నల్లకుంట: నల్లకుంట ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వహించిన మొగిలిచర్ల రవి స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బీ)కు బదిలీ అయ్యారు. సోమవారం ఉదయం నూతన ఎస్‌హెచ్‌ఓ జగదీశ్వర్‌రావుకు బాధ్యతలు అప్పగించి రిలీవ్ అయిన ఆయనను స్టేషన్ సిబ్బంది శాలువా, గజమాలతో సన్మానించి ప్రధాన గేట్ వరకు తీసుకెళ్లి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణలో పూర్తి సహకారం అందించిన స్టేషన్ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. అడ్మిన్ ఎస్సై శివశంకర్, ఎస్సైలు కృష్ణ, రమాదేవి, ఏఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

పింగళి వెంకయ్య సదా స్మరణీయులు



నివాళులర్పిస్తున్న కొలకలూరి ఇనాక్ తదితరులు

చిక్కడపల్లి: దేశ ప్రజలందరూ గర్వపడేలా త్రివర్ణ జాతీయ పతాకాన్ని రూపొందించిన పింగళి వెంకయ్య భారతీయులకు సదా స్మరణీయులని వేంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ కొనియాడారు. చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో సోమవారం పింగళి వెంకయ్య సంస్మరణ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇనాక్ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్య సైనిక ఉద్యోగం వదిలి గాంధీజీ మార్గంలో జాతీయ ఉద్యమాల్లో వెంకయ్య పాల్గొన్నారన్నారు. గాంధీజీ సూచన మేరకు త్రివర్ణ పతాకం రూపొందించారని వివరించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పదవులు ఆశించని నిస్వార్థ దేశ ప్రేమికుడు వెంకయ్య అని కొనియాడారు. వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు మాట్లాడుతూ.. పింగళి వెంకయ్య స్వాతంత్ర్య సమర యోధుడే కాక సైనికుడిగా ఉపాధ్యాయులుగా పరిశోధకులుగా కూడా ప్రసిద్ధులన్నారు. చివరి రోజుల్లో ఆర్థికంగా ఇబ్బంది పడినా విలువలకే కట్టుబడి ఉన్నారని వివరించారు. గానసభ అధ్యక్షుడు కళాజనార్దనమూర్తి అధ్యక్షత వహించి మాట్లాడుతూ.. వెంకయ్యకు ప్రభుత్వాలు తగిన గుర్తింపు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కవులు తంగిరాల చక్రవర్తి, సూరి భగవంతం ట్రస్టీ ఎస్.బీ. రాం, అపర్ణ పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఉచిత ఆన్‌లైన్ సేవలు



ఆన్‌లైన్ సేవలను ప్రారంభించిన శ్రీగణేశ్

కంటోన్మెంట్: ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూడటమే తమ ఫౌండేషన్ లక్ష్యమని శ్రీగణేశ్ ఫౌండేషన్ చైర్మన్, శ్రీగణేశ్ అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాల వినియోగానికి సంబంధించిన ఉచిత ఆన్‌లైన్ సేవలకు శ్రీకారం చుట్టారు. సోమవారం కంటోన్మెంట్ పరిధిలోని ఐదు వార్డుల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ పథకాలకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు, మార్పులు, చేర్పుల ప్రక్రియలో అవగాహన లేమితో చాలా మంది అర్హులైన వ్యక్తులు సద్వినియోగం చేసుకోవడం లేదన్నారు. తన వద్దకు సాయం కోసం వచ్చే వారిలో మెజారిటీ సమస్యలు ఇలాంటివే ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో నేరుగా ప్రజల వద్దకే వెళ్లి సేవలు అందించే కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించామన్నారు. నూతన రేషన్ కార్డులు, కొత్త ఓటర్, ఆధార్ కార్డులు, వృద్ధాప్య, వివిధ ఆన్‌లైన్ దరఖాస్తులను ప్రజల ఇంటివద్దే ఉచితంగా అందిస్తున్నామన్నారు. రెండో వార్డులో సిల్వర్ కాంపౌండ్ డబుల్ బెడ్రూమ్ వద్ద, మూడో వార్డులో భార్గానా ముత్తుమరియమ్మ ఆలయం సమీపం, నాలుగో వార్డులో గాంధీకాలనీ, ఐదో వార్డులో కాకాగూడలో ఆన్‌లైన్ సేవలు ప్రారంభించామన్నారు.

పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సహకరించాలి



నాయకులతో సమావేశమైన సుధాంశ్

సికింద్రాబాద్: పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, మౌలిక వసతుల విషయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని సికింద్రాబాద్ ఎన్నికల అధికారి, డిప్యూటీ కమిషనర్ ఎన్.సుధాంశ్ కోరారు. సోమవారం జీహెచ్ఎంసీ కార్యాలయంలో ఆయన వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఇప్పటికే శిథిలావస్థకు చేరిన, కూలిన పోలింగ్ కేంద్రాల భవనాలను గుర్తించామన్నారు. ప్రత్యామ్నాయ భవనాలను ఎంపిక చేసి ఎన్నికల కమిషన్ ఆమోదం కోసం పంపించామన్నారు. అదే తరహా భవనాలు ఉన్నట్లయితే తమ దృష్టికి తేవాలన్నారు. ఓటర్ల జాబితా సవరణల పనుల నిమిత్తం బూత్‌లెవల్ ఆఫీసర్లు ఇంటింటి పర్యటనలు చేస్తున్నట్లు చెప్పారు. సర్వే చేస్తున్న బీఎల్ఓ బృందాలకు సరైన వివరాలు అందించేందుకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో సహాయక ఎన్నికల అధికారి హేమలత, ఎన్నికల విభాగం ఇన్‌చార్జి కే.భుజేందర్‌బాబు, నాయకులు రాజసుందర్, జలంధర్‌రెడ్డి, ప్రకాశ్, ప్రవీణ్, నర్సింహులు పాల్గొన్నారు.

85 మంది రైల్వే ఉద్యోగుల పదవీ విరమణ

అడ్డగుట్ట: దక్షిణ మధ్య రైల్వేలో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న 85 మంది ఉద్యోగులు సోమవారం పదవీ విరమణ పొందారు. హెడ్ క్వార్టర్స్, సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజన్లతో పాటు లాలా గూడ వర్క్‌షాప్‌లో వీరు విధులు నిర్వహించారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, అధికారులకు ఆత్మీయ వీడ్కోలు పలుకుతూ సికింద్రాబాద్‌లోని రైల్వే కార్యాలయాలు సందడిగా మారాయి. రైల్ నిలయంలో అకౌంట్స్ విభాగంలో అకౌంట్స్ ఆఫీసర్ రంగసాయి బాబు, జీ. రామకోటేశ్వరరావు, సంచాలన్ భవన్‌లో పి. వెంకటేశ్వరరావు, నరసింహం తదితరులను ఎంప్లాయీస్ సంఘ్ మీడియా కోఆర్డినేటర్ షేక్ రవూఫ్, మజ్దూర్ యూనియన్ అకౌంట్స్ బ్రాంచి కార్యదర్శి చింతకుంట రామకృష్ణ శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను బహూకరించారు.

అంబర్‌పేట్ ఎస్టీపీకి ఐఎస్ఓ ధ్రువపత్రం

సాక్షి,సిటీబ్యూరో: మురుగు నీటి శుద్ధి కేంద్రాల నిర్వహణ, నాణ్యత ప్రమాణాలు, సిబ్బంది ఆరోగ్యంలో తీసుకుంటున్న జాగ్రత్తలకు పారిశుద్ధ్య నిర్వహణలో జలమండలి అంబర్‌పేట్ ఎస్టీపీకి ఐఎస్ఓ ధ్రువపత్రం లభించింది. మొత్తం మూడు విభాగాల్లో ధ్రువపత్రం రాగా.. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్‌బాబు, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్‌కుమార్, ఎస్టీపీ సర్కిల్ సీజీఎం సుజాత, జీఎం సుబ్రహ్మణ్యం తదితరులు ఎండీ దానకిశోర్‌కు సోమవారం వీటిని అందజేశారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు, ఉద్యోగులు, సిబ్బందిని ఎండీ ప్రశంసించారు. జలమండలికి క్వాలిటీ మేనేజ్‌మెంట్ – ఐఎస్ఓ 9001–2015, ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టం – ఐఎస్ఓ14001–2015, ఆక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీ మేనేజ్ మెంట్ – ఐఎస్ఓ 45001–2018 విభాగాల్లో ధ్రువపత్రం లభించాయి. ప్రస్తుతం నగరంలో 25 ఎస్టీపీలు ఉండగా.. వీటి మొత్తం సామర్థ్యం 772 ఎంఎల్డీలు. వీటిలో 20 ఎస్టీపీలను జలమండలి నిర్వహిస్తుండగా.. వీటి ద్వారా 714 ఎంఎల్డీల మురుగును 95 శాతం శుద్ధి చేస్తున్నారు. శుద్ధి ప్రక్రియలో పీహెచ్, బీఓడీ, సీఓడీ, టీఎస్ఎస్ తదితర పారామీటర్లను ఆన్‌లైన్ కంటిన్యూయస్ ఇఫ్లూయెంట్ మానిటరింగ్ సిస్టం టెక్నాలజీ ద్వారా పర్యవేక్షిస్తున్నారు.

నటి జయసుధను కలిసిన ఐజాక్‌రాజ్



నల్లకుంట: బీజేపీ మైనార్టీ మోర్చా మీడియా కన్వీనర్ ఎం.ఐజాక్‌రాజ్ టాలివుడ్ నటి జయసుధను మర్యాదపూర్వకంగా ఆమె నివాసంలో కలిశారు. త్వరలో బీజేపీలో చేరబోతున్నందుకు ఆమెకు అభినందనలు తెలిపారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి



శంకర్‌లూక్‌ను సన్మానిస్తున్న భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు

ముషీరాబాద్: మైనార్టీల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేశారని తెలంగాణ రాష్ట్ర మైనార్టీ కమిషన్ వైస్ చైర్మన్ బి.శంకర్‌లూక్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర మైనార్టీ కమిషన్ వైస్ చైర్మన్‌గా నూతనంగా నియమితులైన శంకర్‌లూక్‌ను సోమవారం భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శంకర్‌లూక్ మాట్లాడుతూ.. మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే నేతలకు సీఎం కేసీఆర్ గుర్తించి పదవులను అప్పగిస్తారన్నారు. ప్రవీణ్, పార్టీ సీనియర్ నాయకులు కొండమడుగు మధు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

చిక్కడపల్లి: శాంతిభద్రతల పరిరక్షణలో తనవంతు కృషి చేస్తానని చిక్కడపల్లి నూతన ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్ అన్నారు. సోమవారం చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు.

- చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ కొత్త ఇన్‌స్పెక్టర్‌గా ఎం.వీరేశం సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. 2009 బ్యాచ్‌కు చెందిన వీరేశం రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఎస్సైగా విధులు నిర్వహించిన అనంతరం ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతిపై చిక్కడపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా నియమితులయ్యారు.

దరఖాస్తులకు ఆహ్వానం

నల్లకుంట: నల్లకుంటలోని సాయిస్మృతి మ్యూజిక్ అకాడమీలో త్వరలో జరిగే సంప్రదాయ కీర్తనల్లో ప్రత్యేక శిక్షణాతరగతులు ప్రారంభం కానున్నాయి. ఆసక్తి కలిగిన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని అకాడమీ డైరెక్టర్ గౌరీభట్ల వసుధామూర్తి సోమవారం ప్రకటించారు. ఆసక్తి కలిగిన వారికి మ్యూజిక్ థెరపీ, కీ బోర్డులో కూడా శిక్షణ ఇస్తామన్నారు. ఎలాంటి వయోపరిమితి లేదని, అన్ని వయసుల వారు ఈ శిక్షణా తరగతులకు హాజరుకావొచ్చన్నారు. వివరాలకు సెల్ 83749 27736 నంబరును సంప్రదించాలని కోరారు.

వరద మృతులకు రూ. 25 లక్షల సాయం అందించాలి



మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ

ముషీరాబాద్: రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల్లో కొట్టుకుపోయి మరణించిన వ్యక్తులకు ఒకొక్కరికి రూ.25 లక్షల ఆర్థికసాయాన్ని అందించాలని బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ డిమాండ్ చేశారు. వరద బాధితులకు తక్షణ సాయంగా రూ.20 వేలు, పంట నష్టానికి ఎకరాకు రూ.20 వేలు, పశు, మత్స్య నష్టాలకు కూడా పరిహారం చెల్లించాలని ఆయన రాష్ట్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. విద్యానగర్‌లోని బీసీభవన్‌లో సోమవారం మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్న రూ.900 కోట్ల కేంద్ర జాతీయ విపత్తు నిధులు వాడుకుని తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించగా.. దీనికి రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు ఆ నిధులు ఎక్కడివని ప్రశ్నించడంపై తక్షణ విచారణ చేయాల్సిందిగా ఆయన డిమాండ్ చేశారు. గతంలో ఇలాంటి పరిస్థితి వస్తే ముందస్తు చర్యగా డిజాస్టర్ మెనేజ్‌మెంట్ ప్లాన్ విధిగా తయారై అందుబాటులో ఉండేలా కేంద్ర, రాష్ట్ర బలగాలు, అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేసేవని తెలిపారు. ఈ ప్రభుత్వ హయాంలో అన్ని వ్యవస్థలు స్వయం ప్రతిపత్తి కోల్పోయినట్లే ఈ శాఖ కూడా కోల్పోయిందన్నారు. బీసీ సంఘం నాయకులు నీల వెంకటేష్, సుధాకర్, రాజేందర్, గుజ్జ కృష్ణ, వేముల రామకృష్ణ, శివ, బలరాం తదితరులు పాల్గొన్నారు.

వరదసాయాన్ని వెంటనే విడుదల చేయాలి

కాచిగూడ: భారీ వర్షాల నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వరదసాయాన్ని వెంటనే విడుదల చేయాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం కాచిగూడలోని బీసీ మహాసభ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రూ.10వేల కోట్లను రాష్ట్రానికి తక్షణ వరదసాయంగా ఇచ్చి ఆదుకోవాలన్నారు. వరదల్లో చనిపోయిన వారి కుటుంబాకు రూ.10 లక్షల నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని కోరారు. ఇళ్లు కూలిపోయిన వారికి రూ.లక్ష, పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లకు రూ.50వేలు ఆర్థిక సాయాన్ని అందించాలని తెలిపారు. డాక్టర్‌ప్రశాంత్, భాస్కర్, ప్రదీప్‌గౌడ్, కిషోర్, ముత్యాలరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జంగమ సమాజం గ్రేటర్ నూతన కమిటీ



సుందరయ్య విజ్ఞాన కేంద్ర: తెలంగాణ జంగమ సమాజం గ్రేటర్ హైదరాబాద్ నూతన అధ్యక్షుడిగా బద్రేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా మఠం ఎరస్వామి, కోశాధికారిగా విశ్వనాథంలు ఎన్నికయ్యారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ జంగమ సమాజం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించగా.. ఈ ఎన్నికల్లో 1600 మంది సభ్యులు పాల్గొన్నారు. ఎన్నికల అధికారిగా టి.రవీంద్రనాథ్ వ్యవహరించారు. జంగమ సమాజం రాష్ట్ర అధ్యక్షుడు విశ్వేశ్వరయ్య, ప్రధాన కార్యదర్శి శివకుమార్, ఉపాధ్యక్షులు వి.నాగభూషణం, కోశాధికారి జగదీష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎన్నికైన వారికి నియామక పత్రాలను అందజేశారు.



ఆవిష్కరిస్తున్న సంజీవ్‌కుమార్, ఎర్రం నర్సింగ్‌రావు తదితరులు

పోస్టర్ ఆవిష్కరణ

చిక్కడపల్లి: రాజ్యాధికార సాధనకు కోరుట్లలో ఆగస్టు 13న నిర్వహిస్తున్న పద్మశాలి ప్రజా సంఘం అధ్యక్షులు సంజీవ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఎర్రం నర్సింగ్‌రావు, కోశాధికారి సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం 'ఛలో కోరుట్ల' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రామ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఈ ఆత్మ గౌరవ సభకు పెద్దసంఖ్యలో పద్మశాలీలు హాజరు కావాలని సూచించారు. కార్పొరేటర్ ఎ.పావనీవినయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుర్రంశంకర్, వినయ్‌కుమార్, ఉర్మిళ ఎయిర్‌టెల్ రాజు, ఎం.ఆనంద్, నవీన్, సురేష్, నేత శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన టౌన్‌ప్లానింగ్ ఏసీపీ



చిక్కడపల్లి: జీహెచ్ఎంసీ సర్కిల్–15 టౌన్‌ప్లానింగ్ ఏసీపీగా రమేష్ నియమితులయ్యారు. సోమవారం ఈ సందర్భంగా రమేశ్ మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే ముఠాగోపాల్‌ను కలిశారు. బీఆర్ఎస్ పార్టీ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు రావులుపాటి మోజస్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ బీసీబంధు



దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి అర్హులైన లబ్ధిదారులందరికీ బీసీబంధు ఇస్తామని డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావుగౌడ్ తెలిపారు. తార్నాక డివిజన్‌కు చెందిన పలువురు బీసీ బంధు దరఖాస్తు దారులు బీఆర్ఎస్ యువజన విభాగం నగర అధ్యక్షుడు ఆలకుంట హరిబాబు నేతృత్వంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చి డిప్యూటీ స్పీకర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారుల దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ పూర్తయిందని అర్హులందరికీ బీసీ బంధు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. లబ్ధిదారులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ఆగస్టు 1న సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తామన్నారు.

సెల్‌ఫోన్ చోరీల ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో చేయాలి



రికవరీ చేసిన సెల్‌ఫోన్లను బాధితులకు అందిస్తున్న షేక్‌సలీమా

సికింద్రాబాద్: సెల్‌ఫోన్లు చోరీకి గురైన సందర్భాల్లో రైలు ప్రయాణికులు ఆన్‌లైన్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేసుకోవాలని సికింద్రాబాద్ రైల్వే ఎస్పీ షేక్ సలీమా కోరారు. సోమవారం రైల్వే ఎస్పీ కార్యాలయంలో ఆమె సమావేశం నిర్వహించారు. రైలు ప్రయాణికుల సెల్‌ఫోన్లు ఎక్కడ చోరీకి గురైనా రైల్వే పోలీస్‌స్టేషన్ వరకు వచ్చే పనిలేకుండా సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) యాప్ ద్వారా ఫిర్యాదు చేసుకోవచ్చాన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 14 నుంచి రైల్వే పోలీసులకు ఈ యాప్ అందుబాటులోకి వచ్చిందని అప్పటి నుంచి ఇప్పటి వరకు తమకు 101 ఫిర్యాదులు యాప్ ద్వారా రాగా 46 ఫోన్లను రికవరీ చేశామన్నారు. ఆర్పీఎఫ్ పోలీసులు, ఎన్జీఓ ప్రతినిధుల సహకారంతో 13 కేసుల్లో 200 మంది బాల కార్మికులను సంరక్షించి వసతిగృహాలు, తల్లితండ్రులకు అప్పగించామన్నారు. ఆంధ్రా–ఒడిస్సా మార్గంలో నడిచే రైళ్లలో గంజాయి అక్రమ రవాణా ఎక్కువగా జరుగుతుందని ఇప్పటి వరకు 3442 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని 151 మందిని రిమాండ్‌కు తరలించామని మరో 8 మంది నిందితులపై పీడీ యాక్టు నమోదు చేసినట్టు తెలిపారు. సమావేశంలో రైల్వే డీఎస్పీ నర్సయ్య, ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీను తదితర అధికారులు పాల్గొన్నారు.